
# గూబలో లాభం

శివరాజు



నేను విశాఖపట్నానికి వందకిలో మీటర్ల దూరంలో వున్న పల్లెటూళ్ళో పని చేస్తున్నాను. తిరుపతన్న మా విశాఖపట్నం బ్రాంచిలో పనిచేస్తున్నాడు. నేను కేంపు మీద విశాఖపట్నం వెళ్లినప్పుడల్లా ఏదో పని చెప్తాడు, తిరుపతన్న.

"ప్రత్యేకించి ఏ పనీ లేనప్పుడు ఖాళీ చేతులు వూపుకొంటూ రావద్దని, పదిరూపాయలకు తక్కువ కాకుండా మా వూరి నుంచి కూరలు తెచ్చి పడెయ్యమని" నాకు స్టాండింగ్ ఇనస్ట్రక్షన్స్ యిచ్చేడు తిరుపతన్న. అవును మరి! ఆ కూరలే విశాఖపట్నంలో కొంటే యిరవై రూపాయలకి తక్కువ వుండవు.

ఒకసారి కూరలు పట్టుకొని నేను తిరుపతన్న సీటు దగ్గరకి వెళ్ళేసరికి అన్న ఎవరితోనో రహస్యంగా మాట్లాడుతున్నాడు. నేను కొద్దిగా దూరంగా నిలుచుని చూస్తున్నా తిరుపతన్న ఖాళీ అయితే కూరలు యిచ్చి పోదామని నా వూహ. అయిదు నిముషాల తర్వాత తిరుపతన్న అతని జేబులో రెండు వందల కాగితాలు బలవంతంగా కుక్కేడు. అతను మరోక నిమిషం మాట్లాడి వెళ్లిపోయాడు.

అప్పుడు నేను తిరుపతన్న దగ్గరికి వెళ్ళేను. కూరలకి థాంక్స్ చెప్పేడు. నేను తరువాత నెలలో విశాఖపట్నం వచ్చినపుడు తేవలసిన కొండ చీపుర్లకి డబ్బులిచ్చేడు అప్పుడు గమనించేను తిరుపతన్న చేతికి వాచీ లేకపోవటం.

నా చూపు గమనించి నవ్వుతున్నాడు తిరుపతన్న.

"మా అబ్బాయి వాచీ కొనమని గోల పెడుతున్నాడోయ్. నీకు తెల్సుగా... బజార్లో మంచి వాచీ రెండువందల పైన పలుకుతోంది. అదే వాచీ 'నేవల్ బేస్'లో అయితే రెండువందలకే వచ్చేస్తుంది. అందుకే "బేస్" నించి ఒక వాచీ పట్టుకు రమ్మనమని, ఆ హాజీమస్తాన్‌కి రెండువందలు యిచ్చేను..." అన్నాడు.

హాజీమస్తాన్ అసలు పేరు నాకు తెలియదు. ఆ మాటకొస్తే అతనే మరచిపోయి వుంటాడు. అతని గురించి అంతకు ముందు కొంత విని వున్నాను. "నేవల్ బేస్" స్టోరులో తనకి వున్న పరపతి ఉపయోగించి బేస్ స్టోర్సునించి టంగ్‌క్లీనర్ దగ్గర్నుంచి రిఫ్రిజిరేటరు వరకు అన్నీ ఏర్పాటు చేయగలనంటాడు హాజీ మస్తాను.

నేవల్ బేస్ స్టోరులో ఏవస్తువయినా బహు చవకగా దొరుకుతుంది. టాక్సులలో కొంత మినహాయింపు వలన, హోల్ సేల్ కొనుగోళ్ళ వలన, వాళ్ళు రాయితీ యివ్వగల్గుతారు. అంతేత, కొన్ని వస్తువులలో అయితే, నూటికి ముప్పై రూపాయలు కూడా కలిసొస్తుంది.

అయితే, హాజీమస్తాన్ గురించి అందరూ ఒకే రకమైన అభిప్రాయాన్ని వెలిబుచ్చరు.

"మాయముండాకొడుకు... యిచ్చిన డబ్బులు తినేస్తాడు" అంటారు కొందరు.'

"కొద్దిగా ఆలస్యమయినా నాణ్యమైన సరుకు తెస్తాడు" అంటారు మరికొందరు.

ఏదిఏమైనా మస్తాన్ చేతికి డబ్బులిచ్చి అతని చుట్టూ తిరిగి దేబిరించటం మాత్రం ఎవరూ మానరు.

హాజీ మస్తాన్ వాచీ తెచ్చేలోగా కొడుకు సతాయింపు భరించలేక, తిరుపతన్న తన వాచీ యిచ్చేసేడట:

మరునటి నెలలో కొండచీపుర్లు తెచ్చియిచ్చేసరికి యింకా బేసులో వాచీలు రాలేదని తెలిసింది. ఆ తరువాత నేను ఒక నెల రోజులు సెలవలో వెళ్ళేను. నేను చేటలు పట్టుకొని తిరుపతన్నని కలిసేను. అప్పటికీ వాచీ రాలేదు.

ఈ హాజీమస్తాన్ విషయంలో వికరమైన విషయం తెల్సుకుందామని వుంది నాకు. నమ్మకం కుదిరితే, నేను కూడా డబ్బు యిచ్చి, బేసులోంచి వాచీ తెప్పించు కొందామని వుంది. ఆ వుత్సాహంలో తిరుపతన్న వాచీ గురించి ఎప్పటికప్పుడు తెలుసుకొంటున్నాను.

మరోక నెలలో కొబ్బరి తాళ్ళు తెచ్చేను. అప్పుడు మళ్ళీ అడిగేను తిరుపతన్నని.

"వాచీలు వచ్చేయన్నా! ఆ సంగతి తెల్సి మా మస్తాన్ వెళ్ళేడు పాపం! కాని ఆ సరికే అవి అయిపోయాయట" అన్నాడు తిరుపతన్న.

కాని, లోపాయకారీగా నాకు తెల్సిన సంగతి ఏమిటంటే..." ఆ డబ్బు మస్తాన్ ఖర్చు పెట్టేసుకొన్నాడని"

ఆ తరువాత చింతపండు బుట్టలు తెచ్చిన నెలలో కనుక్కొన్నాను. అప్పటికీ వాచీ రాలేదు.

"వాచీలు వచ్చేయట. మస్తాన్ ముందుగానే "బేస్" కేంటిన్ కుర్రాడికి డబ్బు యిచ్చేసేడట. కాని ఆ కుర్రాడు 'వాచీలు అప్పుడే రావులే అన్నధీమాతో", ఆ డబ్బులు ఖర్చు పెట్టేసేడట. తీరా వాచీలు వచ్చేసరికి ఆ కుర్రాడి దగ్గర డబ్బుల్లేవట. ఆ సంగతి తెలిసి, మరోక రెండువందలు పట్టుకొని నేను, మస్తాన్ పరిగెట్టాం. కాని అప్పటికే వాచీలు అయిపోయాయట. వెంటనే డబ్బు సిద్ధం చెయ్యమని కుర్రాడిని రహస్యంగా కేకలేసి మస్తాన్ వచ్చేసాడు. అతను మాత్రం ఏం చేస్తాడు పాపం!" అన్నాడు తిరుపతన్న.

తరువాత నెలలో పండుగవెల కావటంతో నేను విశాఖపట్నం వెళ్లలేదు. ఆ నెలలో పంపించవలసిన బెల్లం దిమ్మలు... పంపించేశాను తిరుపతన్నకి.

ఆ తరువాత కూడా మరికొన్ని నెలలు నన్ను విశాఖపట్నం పంపించలేదు, మా ఆఫీసు వాళ్లు. నా

సీనియర్ ఒకతను సెలవులో వుంటే, అతని ఆరోగ్యం బాగయ్యేవరకు, అతని సీటు చూసుకోమన్నారు. నాకు బదులు మా వాడు మరొకడు విశాఖపట్నం వెళ్లి వస్తూవుండేవాడు. వాడికి కూడా, సైను గుడ్డలు..... తుంగచాపలు..... ప్రతినెలా యిలా ఏదో ఒకటి కొని తీసుకొని వెళ్ళి తిరుపతన్నకి యిచ్చి రావటం అలవాటయ్యింది.

సుమారు ఏడాది తర్వాత, నేను కూరలు పట్టుకొని విశాఖపట్నం వెళ్ళాను. అప్పటికీ తిరుపతన్న చేతికి వాచీ రాలేదు. నా పరామర్శకి జవాబుగా "మరొక నెలలో స్టాక్ వస్తున్నాదని" చెప్పాడు తిరుపతన్న.

అన్నట్టు చెప్పటం మరిచేను ఈ తిరుపతన్న వాచీ విషయంలో మా ఆవిడకూడా ఆసక్తి చూపించి ఎప్పటి కప్పుడు విషయం సేకరిస్తోంది.

మరుసటి నెలలో పనసకాయలు తీసుకొని వెళ్ళేసరికి, తిరుపతన్న చేతికి వాచీ మెరుస్తోంది.

నేను వాచీ వైపు చూడటం గమనించేసరికి తిరుపతన్న కళ్ళు కూడా మెరిసాయి.

"లేటెస్ట్ మోడలన్నా! ఒకే ఒక పీసు వచ్చింది. మూడువందల పదికే దొరికింది." వివరాలన్నీ చెప్పుకొచ్చేడు తిరుపతన్న ఆనందంగా.

వాచీ చాలా అందంగా వుంది అదే బజార్లో కొంటే మూడు వందల ఎనభై! అంటే డెభై రూపాయలు ఆదా అన్నమాట!!

మా వూరు వచ్చాక మెల్లగా మా ఆవిడతో ఈ విషయం ప్రస్తావించాను. నాకు కూడా మస్తాన్ ద్వారా ఒక వాచీ పొకలో కొనుక్కోవాలని వుంది. మస్తాన్ ద్వారా, వాచీ పొకలో వస్తుందన్న నమ్మకం కూడా కుదిరింది.

విషయం అంతా విని, నా కోరిక విన్నాక,

"మీకు మతిలేదా?" అని అడిగింది మా ఆవిడ.

ఉలిక్కిపడ్డాను. డెభై రూపాయలు ఆదా చెయ్యటం మతిలేని పని ఎలాగయిందో బోధపడలేదు నాకు.

అదే అడిగాను ఆవిడని.

"ఏడాదిన్నర... రెండేళ్ళ క్రిందట రెండువందల నలభైరూపాలయకే దొరికే వాచీ కోసం, డెభై రూపాయలు ఆదా చేద్దామని మీ తిరుపతన్న మస్తాన్ని పట్టుకొన్నాడు. మీ తిరుపతన్న అప్పుడే బజార్లో కొనుక్కొని వుంటే ఇదే వాచీ అప్పుడు రెండువందల నలభైకి దొరికేది. అదే యిప్పుడు లేటులో మూడువందల పదికి కొన్నారు. అంటే... ఇప్పుడు చెప్పండి! మస్తాన్ ద్వారా కొనడం వలన మీ తిరుపతన్న డెభై రూపాయలు ఆదా చేసాడో... లేకపోతే డెభై రూపాయలు నష్టపోయాడో?" వివరించింది మా ఆవిడ.

విషయం బోధ పడింది నాకు.

ఇప్పుడు నేను వాచీలే కాదు, మరి ఏ యితర వస్తువులూ కూడా 'మస్తాన్' ల ద్వారా కొనదలుచుకోవటం లేదు. కావలసిన సమయంలో, కంటికి నచ్చింది, బజార్లో హాయిగా కొనుక్కుంటున్నాను. ●

# ప్చ్!

-అత్తలూరి నరసింహారావు

ఇక్కడా క్షేమం, అక్కడా క్షేమమని తలుస్తాను
ఇక్కడ అయిదు లోపలే చీకటి
చలి బాగానే
పొద్దున్నే లేచి హడావుడిగా
పిల్లలు ఏడింటి కల్లా స్కూలు బస్సులోకి
నేను ఎనిమిది కల్లా సిటీ బస్సులోకి
తర్వాత చీకటిలోనే ఇంట్లోకి అందరం.
ఆ తర్వాత కూరగాయల వేట
పచారీ సరుకుల పాట్లు
నెమ్మదిగా ఇడియట్స్‌లా టివీ ముందు
అప్పుడప్పుడు మనుషుల మధ్య
మళ్లీ నిద్ర, మళ్లీ లేవడం
వేగడం, రావడం
నా చీకటి గదిలోకి
ఇక్కడ స్థిరపడినట్లే
అపుడపుడు బయట బజారు చెయ్యటం
ఒకసారి పర్సు పోగొట్టుకున్నా
మరోసారి అలారం గడియారం కొని మోసపోయా
ఇవ్వాళ మా ఆవిడ పెద్ద చెవులకి అతి చిన్న పోగులు కొన్నా
మళ్లీ మోసపోయానా అని ప్రశ్నల మీసాలు
నా వుత్తరంలో మీ వూరు వర్ణన బాగుంది
అవునూ, ఇల్లు ఏమన్నా కొన్నావా
మన నాయక్ నాయుడు పేటలో కొన్నాడు
ప్రకాశరావు మద్రాసులో కట్టిస్తున్నాడు
స్వామి చీరాలలో కట్టిస్తున్నాడు
రత్నం సికింద్రాబాదులో కొన్నాడు
సత్యనారాయణ శాస్త్రి గోగినేని పాలెంలో కట్టిస్తున్నాడు
విశ్వనాథరెడ్డి విశాఖలో స్థలం కొన్నాడు
నా తమ్ముళ్లకు స్థలాలు అమిరాయి
నాకు లేదులే!
మరి నీకు?
ఇక్కడ ఎండు మిరపకాయలు అరవై రూపాయలు
ఉల్లిపాయలు ఎనిమిది
మంచి నూనె నలభై
దానిమ్మ ఇరవై రెండు నుంచి ఇరవై ఎనిమిది వరకు
యాపిల్ పదిహేను నుంచి ఇరవై రెండు దాకా
పాలు ఆరు
ద్రాక్ష మర్చిపోయాం
జీడిపప్పు పేరు వింటేనే జడుపు
అక్కడకూడా ఇంతేనా?
మా ఆవిడకి నాలుగోసారి జ్వరం
మా చెల్లెలి కట్నం కోసం స్కూటర్ అమ్మేశాను
ఇక్కడ తిరగలేక చస్తున్నా
మన దేశం ఎటుపోతోంది
అస్థి పంజరాన్ని విశ్వానికి చూపుతూ ●